సాక్షి నిర్మల్

శుక్రవారం । 6 । జనవరి । 2023



ఖందేవ్ పూజకు వేళాయె

11వ దశాబ్దం పూర్వం మండల కేంద్రంలో వెలసిన ఆదిమ గిరిజన తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖందేవ్ క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

8లో▸



ఆదర్శంగా సర్కారు బడి 9లో▸

లోకేశ్వరం మండలం సేవాలాల్‌తండా ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామస్తులు, యువజన సంఘాల ప్రోత్సాహం, దాతల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

గరిష్టం/కనిష్టం
29.5 / 16.3

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమౌతుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిర్మల్, భైంసా మున్సిపాలిటీలకు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు



సర్టిఫికెట్ అందుకుంటున్న హేమంత్ బోర్కడే, సంపత్‌కుమార్

భైంసాటౌన్: నిర్మల్, భైంసా మున్సిపాలిటీలకు ఓడీఎఫ్(బహిరంగ మలవిసర్జన రహిత) ప్లస్ ప్లస్ గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మిషన్ డైరెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, నిర్మల్, భైంసా(ఇన్‌చార్జి) మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. 2022, ఫిబ్రవరి 25 నాటికి ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ లక్ష్యాన్ని చేరుకున్నందుకు ఈ సర్టిఫికెట్ అందించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కలెక్టరేట్ పనులు పరిశీలన



పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎల్లపెల్లి సమీపంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం పనులను కలెక్టర్ ముషరఫ్ అలీ గురువారం పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందులో ఆర్డీవో స్రవంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తాం



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: తమకు వేతనాలు ఇవ్వాలని నిర్మల్ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. అంతకుముందు మున్సిపల్ డీఈ దృష్టికి తమ సమస్య తీసుకెళ్లారు. డీఈ ఒక నెల వేతనం విడుదలకు అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ.. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఇంటి అద్దె, నిత్యావసర సరుకులు, పిల్లల స్కూల్ ఫీజులకు ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఈనెల 6న వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. నిరసనలో ఔట్‌సోర్సింగ్, వాటర్‌సప్లయ్, రిజర్వాయర్ వర్కర్స్, బోర్ వెల్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ భైంసా ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి

భైంసాటౌన్: ఆర్టీసీ భైంసా డిపోకు చెందిన కండక్టర్లు టి.లింగయ్య, విజయలక్ష్మి ఉత్తమ అవార్డులు అందుకున్నా రు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో గురువా రం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కండక్టర్ టి.లింగయ్య ఇటీవల విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ప్రయాణికుడు బస్సులో ఎల్‌ఈడీ టీవీ మరిచిపోగా, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి ఆ టీవీని అప్పగించారు. ఇందుకు గుర్తింపుగా ఆయనకు ఎక్స్‌ట్రామైల్ అవార్డు అందజేశారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉత్తమ ఎంప్లాయ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన విజయలక్ష్మికి ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.

టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



నిర్మల్ రూరల్: తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓస శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మామడ మండలం కోర్టికల్ పాఠశాలలో శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.



21,04,367

- ఇదీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య
- పది నియోజకవర్గాల్లో భారీగా పెరుగుదల
- కొత్తగా చేరింది 71,528, తొలగించింది 27,707మంది
- 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లు 27,717మంది

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) 2022 పేరుతో రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో గత జనవరి నుంచి నవంబర్ వరకు మార్పులు, చేర్పులు చేసింది. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితాను గురువారం విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 21,04,367 మంది ఓటర్లు ఉన్నారు. గతంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. పది నియోజకవర్గాల్లో మొత్తం 71,528 మంది ఓటర్లను చేర్చగా, 27,707 మందిని తొలగించారు. అత్యధికంగా ఓటర్లు ఉన్న నియోజకవర్గం మంచిర్యాల కాగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో ఉన్నారు. అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు 311 ముథోల్‌లో ఉండగా, అతి తక్కువగా బెల్లంపల్లిలో 222 కేంద్రాలు ఉన్నాయి. ఇక అత్యధికంగా పురుష, మహిళా ఓటర్లు మంచిర్యాలలో ఉండగా, బెల్లంపల్లిలో అత్యల్పంగా ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు బోథ్‌లో ఇద్దరు ఉండగా, ముథోల్‌లో 27 మంది ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్ల మధ్య చేర్చిన కొత్త ఓటర్లు 27,715 మంది ఉన్నారు. అత్యధికంగా ఆసిఫాబాద్ పరిధిలో 9,421 మంది ఓటర్లు చేరగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో 2,911 మంది చేరారు. మరణించిన, వేరే ప్రాంతానికి వెళ్లిన తదితర కారణాలతో తొలగించిన ఓటర్లను పరిశీలిస్తే.. నిర్మల్‌లో అత్యధికంగా 5,105 మంది ఉండగా, అత్యల్పంగా మంచిర్యాలలో 889 మంది ఓటర్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా బోథ్‌లో ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో ఉన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోపు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఓటరు జాబితా అత్యంత కీలకంగా మారనుంది.

మహిళలే అధికం..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. ఖానాపూర్(ఎస్టీ), ఆదిలాబాద్, బోథ్(ఎస్టీ), నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

బోగస్ ఓటర్లకు చెక్

బోగస్ ఓటర్ల ఏరివేతకు 'ఫొటో సిమిలర్ ఎంట్రీస్' విధానం అవలంబించారు. గత ఏప్రిల్‌లో రెండేసి చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారిని అధికారులు గుర్తించారు. బూత్‌స్థాయిలో బీఎల్‌వోలు సర్వే చేపట్టారు. ప్రతీ ఓటరు ఫొటో ఆన్‌లైన్‌లో ఉండడంతో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానంతో రెండు చోట్ల ఉంటే తొలగించారు. డిసెంబర్‌లో గడప గడపకు సర్వే నిర్వహించి కొత్తవారిని ఓటరు జాబితాలో చేర్చారు.

జిల్లా ఓటర్లు.. 6,71,369

నిర్మల్: జిల్లా ఓటర్లు 6,71,369 మంది ఉన్నట్లు తేల్చారు. ఈసారి కొత్తగా 24,700 మంది ఓటర్లు చేరగా, 12,508 మందిని తొలగించారు. మొత్తం మీద జిల్లా జాబితాలో 12,192 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో ఈసారి కూడా మహిళలదే పైచేయి ఉంది.

మూడు నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువ..

జిల్లా జనాభాలో మహిళలే ఎక్కువ. అలాగే ఓటరు జాబితాలోనూ వారిదే పైచేయి. మొత్తం 6,71,369 ఓటర్లలో 3,24,990 పురుషులు ఉండగా, మహిళలు 3,46,325మంది మహిళలు ఉన్నారు. 21,225 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. నిర్మల్‌లో 1,10,538 మంది పురుషులు, 1,22,696 మంది మహిళలు ఉన్నారు. ఖానాపూర్‌లో పురుషులు 1,01,210, మహిళలు 1,04,537 మంది ఉన్నారు. ముధోల్ నియోజకవర్గంలో 1,13,251 మంది పురుష ఓటర్లకు, 1,19,092 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఒక్క ఖానాపూర్‌లో మాత్రమే స్వల్ప తేడా ఉండగా, మిగిలిన రెండు నియోజకవర్గాల్లో మాత్రం భారీగానే వ్యత్యాసం ఉంది. ఇక థర్డ్‌జెండర్ ఓటర్లు కూడా పెరిగారు. నిర్మల్‌లో 14 మంది, ఖానాపూర్‌లో 13 మంది ఉండగా, ముధోల్ ఏకంగా 27 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 54మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	18-19ఏళ్ల ఓటర్లు	మొత్తం ఓటర్లు
సిర్పూర్	283	1,06,970	1,05,333	7	2,910	2,12,310
చెన్నూర్(ఎస్సీ)	225	88,497	87,947	11	1,692	1,76,455
బెల్లంపల్లి(ఎస్సీ)	222	80,894	80,341	14	1,222	1,61,249
మంచిర్యాల	279	1,24,769	1,24,193	20	1,696	2,48,982
ఆసిఫాబాద్(ఎస్టీ)	301	1,04,107	1,03,785	14	3,082	2,07,906
ఖానాపూర్(ఎస్టీ)	305	1,01,201	1,04,537	13	2,812	2,05,751
ఆదిలాబాద్	281	1,11,039	1,14,016	7	3,055	2,25,062
బోథ్(ఎస్టీ)	301	98,456	1,02,576	2	3,885	2,01,034
నిర్మల్	302	1,10,538	1,22,696	14	3,601	2,33,248
ముథోల్	311	1,13,251	1,19,092	27	3,760	2,32,370

'కంటి వెలుగు' పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముషరఫ్ అలీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో గురువారం సమావేశం నిర్వహించారు. వందరోజుల కంటివెలుగు కార్యక్రమంలో జిల్లాలోని ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. రూపొందించిన కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలలో నూతన వెలుగులు నింపాలన్నారు. ఈ అంశంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సాధించాలని తెలిపారు. జిల్లాలో ఉన్న 396 జీపీలలో, మున్సిపాలిటీలోని 80 వార్డులలో కంటి పరీక్షలు నిర్వహించేందుకు 32 బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహనదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ

నిర్మల్‌టౌన్: మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ట్రా ఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గు రువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 45 వా హనాలు స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్లు తప్పుగా రాసినా, వంచినా, విరగ్గొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుబడ్డ వాహనదారులకు సూచనలు చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్



మాట్లాడుతున్న జడ్జి అజేశ్‌కుమార్

లక్ష్మణచాంద: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులతో గురువారం ఏర్పాటు చేసి న లీగల్ లీటరసీ క్యాంపులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశా రు. ప్రతీ విద్యార్థి తప్పకుండా చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థినులు తమను తాము రక్షించుకునేందుకు చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. పేదలకు ఉచితంగానే న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి ఇటీవల దిశ చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అన్యాయం జరి గినప్పుడు ధైర్యంగా చెప్పుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం పాఠశాల వంట గదిని పరిశీ లించి విద్యార్థులతో మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎస్‌వో నవిత, పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌కు ఖానాపూర్ కమిషనర్

ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం జరిగిన పట్టణ ప్రగతి వర్క్‌షాప్‌కు ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతిలో భాగంగా ఖానాపూర్‌లో చేయాల్సిన పనుల గురించి వివరించడంతోపాటు పట్టణంలో చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనులపై అధికారులు తెలిపిన విషయాలను తెలుసుకున్నారు. అధికారుల సూచనలు ఖానాపూర్ పట్టణ పరిధిలో అమలయ్యేలా చూస్తానని తెలిపారు.

ఉత్తమ ర్యాంకులే లక్ష్యంగా..

- ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్, నీట్ శిక్షణ
- జిల్లాలో ప్రారంభమైన తరగతులు
- ఏప్రిల్, మేలో పూర్తిగా ఉచిత శిక్షణ
- 809 మంది విద్యార్థులకు ప్రయోజనం



విద్యార్థినులకు పాఠం చెబుతున్న అధ్యాపకుడు

నిర్మల్‌ఖిల్లా: ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఏటా ఎంసెట్, నీట్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఇందులో ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సాధించే సీట్లు తక్కువే. ఈ పరిస్థితిని మార్చాలని ఉన్నత విద్యాశాఖ నిర్ణయించింది. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ర్యాంకులు సాధించాలని సంకల్పించింది. ఎంసెట్, నీట్‌లో ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఎంసెట్‌లో సత్తా చాటేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఎంపికైన విద్యార్థులకు ఏప్రిల్, మేలో ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లాకో కోచింగ్ సెంటర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇంటర్ విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్ జారీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఈ శిక్షణ ఉంటుందని ఆయన వెల్లడించారు. పరీక్షలకు ముందు రెగ్యులర్ సిలబస్‌తో సమాంతరంగా ఎంసెట్ శిక్షణ ఇస్తారు. పరీక్షలు ముగిశాక జిల్లాకు 100 మంది విద్యార్థుల చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వనున్నారు.

ఇంజినీర్లు, వైద్యులుగా ఎదగాలని..

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన వారే. విద్యార్థులు కళాశాలల్లో చదువుతూ తీరిక వేళల్లో వ్యవసాయ పనులు, కుటుంబసభ్యులతో కలిసి ఇతర పనులు చేస్తుంటారు. సాధారణ చదువులతోనే విద్యార్థులు ఎంసెట్, నీట్‌లో ర్యాంకులు సాధిస్తున్నారు. కోచింగ్ లేని కారణంగా చాలామంది విద్యార్థులు ర్యాంకుల సాధనలో వెనుకబడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించారు. శిక్షణ ఇస్తే ఇంకా ఎక్కువ మంది ర్యాంకులు సాధిస్తారని భావించిన ఉన్నత విద్యాశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంసెట్, నీట్‌లో శిక్షణ ఇస్తే ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదుగుతారని భావించి శిక్షణకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 809 మందికి ప్రయోజనం..

జిల్లాలో 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఇంటర్ సెకండియర్ (ఎంపీసీ)లో 409 మంది, బైపీసీలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈనెలలో సిలబస్ పూర్తి చేయడంపై అధ్యాపకులు దృష్టిసారించారు. ఇప్పటికే వారానికోసారి పరీక్షలు నిర్వహించి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 2 నుంచి ఎంసెట్, నీట్ శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు ఫిబ్రవరి 15వ తేదీ వరకు కొనసాగిస్తారు.

ప్రత్యేక శిక్షణ శిబిరానికి 100 మంది..

జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు పూర్తయ్యాక వేసవిలో ఎంసెట్, నీట్ ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. ఇందుకోసం ఇంటర్ రెండో సంవత్సరం చదివే ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల్లో వంద మందిని ఎంపిక చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటిన వారిలో 50 మంది బాలురు, 50 మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు. ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలోనే ఉచిత వసతి, భోజనం, మంచి బోధన, స్టడీ మెటీరియల్ అందిస్తారు. మోడ ల్ పేపర్లు అందిస్తూ విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించేలా ప్రణాళిక రూపొందించామని అధికారులు పేర్కొన్నారు. వీరికి వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు ఎంసెట్, నీట్‌లో శిక్షణ ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంసెట్, నీట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించాలన్నదే మా లక్ష్యం. ఈనెల 2 నుంచి రెగ్యులర్ తరగతులతోపాటు ఎంసెట్, నీట్ శిక్షణ తరగతులు ప్రారంభించాం. వార్షిక పరీక్షలు పూర్తయ్యాక జిల్లా కేంద్రంలో 100 మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పరశురాం, ఇంటర్‌విద్య జిల్లా నోడల్ అధికారి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఐఈవో జాదవ్ పరశురాం
- లోకేశ్వరం కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం
- ముందుకు వచ్చిన దాత, కళాశాల అధ్యాపకుడు కారేగాం వినోద్



మాట్లాడుతున్న డీఐఈవో జాదవ్ పరశురాం

లోకేశ్వరం: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్మల్ డీఐఈవో జాదవ్‌పరశురాం ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు కారేగాం వినోద్ ఇంటర్ పరీక్షలు ముగిసే (రెండు నెలల)వరకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈసందర్భంగా జాదవ్ పరశురాం మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. అధ్యాపకుడు, దాత వినోద్‌ను అభినందించారు. వినోద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఒక రోజుకు రూ.5 వేల ఖర్చవుతుందని పేర్కొన్నారు. పరీక్షలు ముగిసే వరకూ ఈ ఖర్చు తానే భరిస్తానని తెలిపారు. విద్యార్థుల కోసమే తాను ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తుకరాం, భైంసా కళాశాల ప్రిన్సిపాల్ జూఫిషా, సారంగాపూర్ ప్రిన్సిపాల్ మారుతి, దిలావర్‌పూర్ ప్రిన్సిపాల్ శంకర్, నిర్మల్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, కుభీర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, లోకేశ్వరం కళాశాల అధ్యాపకులు చిన్నయ్య, శ్రీనివాస్, వినోద్, విఠల్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలి



కొరిటికల్‌లో రైతుకు పత్రం అందిస్తున్న అంజిప్రసాద్

మామడ: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని కోర్టికల్ గ్రామంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఇక్కడి వాతావరణం ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు రాయితీలు ఇస్తుందన్నారు. ఆయిల్‌పాంకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, టెక్నికల్ ఏవో వినోద్, ప్రీయూనిక్ కంపెనీ డీజీఎం రా మ్మోహన్‌రావు, ఏఎం రోహిత్, ఏఈవో సృజితరెడ్డి, క్లస్టర్ అధికారి శశాంక్, రైతులు నల్ల లింగారెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

కడెం: ఉపాధిహామీ పథకాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కొండుకూర్, నచ్చన్ ఎల్లాపూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో కోళ్ల షెడ్, మేకల షెడ్, ఫిష్ పాండ్స్ పనులను గురువారం ప్రారంభించారు. చిట్యాల్‌లో కాలువ మరమ్మతు పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కడెం ఎంపీడీవో కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీ జీపీలో ఐదు వ్యక్తిగత పనులను చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, ఎంపీడీవో లింబాద్రి, ఏపీవోలు, సర్పంచులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

తానూరు: మండలంలోని హిప్నెల్లి బస్‌స్టాప్ వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తానూరు నుంచి జాదవ్ గోపినాథ్, అతడి భార్య జయశ్రీ ద్విచక్రవాహనంపై భైంసా మండలం మంజ్రి గ్రామానికి వెళ్తున్నారు. హిప్నెల్లి గ్రామానికి చెందిన సయ్యద్ ఎల్వి రోడ్డుకు ఉన్న తన వ్యవసాయ పొలానికి ద్విచక్రవాహనంపై వెళ్లున్నాడు. హిప్నెల్లి బస్‌స్టాప్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పై ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో భైంసా ఆస్పత్రికి తరలించారు. జాదవ్ గోపినాథ్ బోల్సా పంచాయతీ కార్యదర్శికాగా, అతడి భార్య జయశ్రీ బోంద్రట్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌లో ఇద్దరు మహిళల మెడలో నుంచి గురువారం రాత్రి దుండగుడు చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నించాడు. స్థానికుల వివరాల ప్రకారం .. ఇద్దరు మహిళలు నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగుడు మహిళ మెడలో నుంచి చైన్ లాగడానికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమైన మహిళ తన మెడలోని చైన్‌ని గట్టిగా పట్టుకొని కేకలు వేసింది. దీంతో ద్విచక్ర వాహనంపై దుండగుడు పరారయ్యాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

జైనథ్: మండలంలోని రాంపూర్–టి గ్రామానికి చెందిన బత్తుల విఠల్, బత్తుల శ్రీనివాస్, అల్లం విఠల్ చేన్లలో అమర్చిన సోలార్ బ్యాటరీలు, కంట్రోలర్‌ల దొంగతనం కేసులో మహారాష్ట్రలోని కిన్వట్ సమీపంలో డోంగర్ గావ్‌కు చెందిన తుకారాంను రాంపూర్ గ్రామంలో అరెస్ట్ చేసినట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. రాంపూర్–టి గ్రామానికి చెందిన బత్తుల విఠల్ తన చేన్లో అమర్చిన సోలార్ బ్యాటరీలు దొంగతనం అయినట్లు ఈ నెల 4న ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం పోలీసులు గ్రామానికి వెళ్లి చూడగా విఠల్‌తో పాటు శ్రీనివాస్, అల్లం విఠల్ చేన్లలోని బ్యాటరీలు, కంట్రోలర్‌లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. అనంతరం రాంపూర్‌లోనే ఓ కిరాయి ఇంట్లో మహారాష్ట్రకు చెందిన తుకారాంపై అనుమానంతో ఇంట్లో తనిఖీలు చేయగా రూ.11వేల విలువ చేసే బ్యాటరీలు, కంట్రోలర్, డివైస్‌లు లభించాయి. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

గర్భిణిపై హత్యాయత్నం

సిర్పూర్(టి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఆరునెలలైనా గడవకముందే హతమార్చేందుకు కుట్రపన్నిన సంఘటన మండలంలోని కేశవపట్నంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కౌటాల సీఐ స్వామి, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన దుర్కె కవిత, కోట మహేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటికే కవిత గర్భిణి. ప్రేమ పెళ్ళి ఇష్టం లేని మహేందర్ ఆమెను హత్య చేసేందుకు కుట్రపన్నాడు. గతనెల 29న కవిత తల్లిగారింట్లో ఒంటరిగా ఉండగా అత్త విమల, మామ లహాను, భర్త మహేందర్ పురుగుల మందు కలిపిన జ్యూస్ తాగించారు. కొద్దిసేపటికి రక్తం కక్కుకుని కిందపడిపోవడంతో మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు. డిసెంబరు 30న ఆడబిడ్డకు జన్మనివ్వగా శిశువు మరణించింది.

ఖండేవ్ పూజకు వేళాయె

- నేటి నుంచి పుజా కార్యక్రమాలు
- ఆలయంలో నెలకొన్న ఆధ్యాతిక శోభ
- ఇతర రాష్ట్రాల నుంచి రానున్న తొడసం వంశస్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు
- 15రోజుల పాటు కొనసాగనున్న జాతర



నార్నూర్‌లోని ఖండేవ్ ఆలయం



మాన్కాపూర్‌లో నువ్వుల నూనె తయారు చేస్తున్న గిరిజనులు

జాతర వివరాలు..
5వ తేదీన మాన్కాపూర్ వద్ద మసాయి దేవతకు తొడసం వంశస్తుల పూజలు
6వ తేదీన ఖండేవ్‌కు మహాపూజ
7వ తేదీన నూనె తాగనున్న ఆడపడుచు, ప్రజాదర్బార్

నార్నూర్: 11వ దశాబ్దం పూర్వం మండల కేంద్రంలో వెలసిన ఆదిమ గిరిజన తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖండేవ్ క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆదిమ గిరిజన తొడసం వంశస్తులు మూడు రోజుల ముందు నుంచి ఆలయ అలంకరణతో పాటు జాతర ఏర్పాట్లు చేపడతున్నారు. ఈ జాతరకు స్వరాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తొడసం వంశస్తులు చేరుకుంటారు. వారి ఆచార, సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఖండేవుడికి పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఖండేవ్ ఆలయం సన్నిధిలో మండలంలోని ఖైర్‌డట్వా గ్రామం తొడసం వంశానికి చెందిన ఆడ పడుచు (కడోద, గిత్తకు చెందిన) ఇంటి నుంచి సేకరించిన కిలో నువ్వుల నూనె తాగి తమ మొక్కును తీర్చుకుంటుంది.

నువ్వుల నూనె సంప్రదాయ మొక్కు..

పుష్య పౌర్ణమి మరుసటి రోజు ఉదయం దేవుడి సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు రెండు కిలోల నువ్వుల నూనె తాగడం ఆనవాయితి. మూడు సంవత్సరాలు ఒక్కరే నూనె తాగాల్సి ఉంటుంది. మండలంలోని చిత్తగూడ గ్రామానికి చెందిన ఆడపడుచు మాడవి యోత్మబాయి మూడుసార్లు నువ్వుల నూనె తాగి మొక్కును తీర్చుకుంది. ఈసారి కడోద, గోత్తికి చెందిన తొడసం ఆడపడుచు నువ్వుల నూనె తాగనుంది. ఈ నూనె తాగడంతో సంతాన యోగం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు తొలుగుతాయని వారి నమ్మకం.



ఆలయంలోని పులి విగ్రహం

ప్రజా దర్బార్..

తొడసం వంశస్తుల మహాపూజ, సంప్రదాయ మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశస్తులు సంప్రదాయ భేటి నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. యువకులతో పాటు వంశస్తులకు తొడసం వంశ పెద్దలు హీత బోధ చేస్తారు. అనంతరం ఆలయం ఆవరణలో మినీ ప్రజా దర్బార్‌ను నిర్వహించి సమస్యలను వివరిస్తారు.

'తొడసం' విజయానికి చిహ్నంగా ఏనుగు



ఆలయంలో ఏర్పాటు చేసిన ఏనుగు విగ్రహం

ధృవరాజులు పాలనలో ఏనుగులను యుద్ధం సమయంలో ఉపయోగించేవారు. రాజ్యానికి సంబంధించిన ఏనుగులు ప్రజలకు సంబంధించిన పంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై దాడులకు పాల్పడుతుండేవి. ఏనుగులను పట్టుకోవడానికి ధ్రువ రాజులు బహుమతి ప్రకటన చేశారు. అప్పటి చంద్రపూర్ కేంద్రంగా గోండ్వానా రాజ్యాన్ని ఆత్రం వంశానికి చెందిన రాజులు పరిపాలిస్తుండేవారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమన్‌కాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలోని ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖండేవ్ పుణ్య క్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టివేశారు. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు సవ్వ చాలీస్ రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించారు. దీంతో అప్పటి నుంచి తొడసం వంశానికి ఏనుగును విజయ చిహ్నంగా భావిస్తున్నట్లు ఆ వంశ పెద్దలు తొడసం బాపురావు, తొడసం రాజు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నియమనిష్టలతో ఖండేవుడికి పూజలు చేయడం జరుగుతుంది. భారత దేశంలో ఎక్కడ ఉన్నా తొడసం వంశస్తులు ఏడాదికోసారి ఇక్కడికి రావాల్సిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటాం. – తొడసం రాజు పటేల్, తొడసం వంశం పెద్ద

ఆనవాయితీగా వస్తుంది..



మా తాతముత్తాల కాలం నుంచి మా వంశ దేవుడు ఖండేవుడికి పుష్య పౌర్ణమి సందర్భంగా పూజలు చేస్తాం. దేశం నలుమూలల నుంచి తొడసం వంశస్తులు ఇక్కడికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. మా సంస్కృతి, సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తాం. ఈ నెల 7న ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలి. – తొడసం నాగోరావు, తొడసం వంశస్తుడు, ఆలయ కమిటీ సభ్యుడు

భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు



తొడసం వంశానికి చెందిన ఖండేవుడి పూజ కోసం అందరి సహకారంతో అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగింది. ఏటా పుష్య పౌర్ణమి సందర్భంగా ఆనవాయితి ప్రకారం పూజలు చేస్తాం. తొడసం వంశానికి చెందిన ఆడ పడుచు నువ్వులు నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జాతరకు వచ్చే భక్తులు కరోనా నిబంధనలు పాటించాలి. – మేస్రం రూప్‌దేవ్, ఖండేవ్ ఆలయ కమిటీ చైర్మన్, నార్నూర్

లక్ష్మీనరసింహుడికి అలంకరణ



చెమ్మలు అందిస్తున్న పోతరాజు రమేష్

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామల సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 7వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాలెండర్ కోసం లక్ష్మీనరసింహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సారంగపూర్ గ్రామానికి చెందిన పోతరాజు రమేశ్ దంపతులు ఆలయానికి చెమ్మలను బహూకరించారు. అర్చకులు వొద్దిపర్తి వంశీకృష్ణమాచార్యులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

చంపుతానని బెదిరించిన కుమారుడిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: తండ్రిని చంపుతానని బెదిరించిన కుమారుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.8 గ్రామానికి చెందిన ప్రతాప్ హల్దార్ గన్నారం గ్రామశివారులోని తన నాలుగెకరాల పంటపొలంలో కూతురు మనిషా, అల్లుడు రూప్‌చంద్‌తో కలిసి వరి పంట సాగు చేశాడు. అయితే ప్రతాప్ హల్దార్‌కు తెలియకుండా చిన్న కుమారుడు దేవమిత్ర హల్దార్ పొలంలోని వడ్ల బస్తాలను అమ్ముకున్నాడు. మిగిలిన బస్తాలను తీసుకెళ్లేందుకు గురువారం మనీషా పొలం వద్దకు వెళ్లగా దేవమిత్ర హల్దార్ దాడి చేసి గాయపర్చాడు. ఈ విషయమై అడిగేందుకు వెళ్లిన తండ్రిని అసభ్యకరంగా దూషించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. ప్రతాప్ హల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన చెప్పిడే రాఘవులు(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన రాఘవులు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతనెల 25న మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మా కుమారుడిని ఆదుకోండి

ప్రజాప్రతినిధులు స్పందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ఖానాపూర్: గుండె సంబంధిత వ్యాధితో జన్మించిన తమ బిడ్డను ఆదుకోవాలని ఆ నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించామని, ఆస్పత్రిలో ఇంకా రూ.3లక్షల వరకు చెల్లించాలని, తమ కుమారుడిని కాపాడుకునేందుకు దాతలు సహకరించాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కావేటి శివకు జన్నారం మండలం మ్యాదరిపేట్‌కు చెందిన శిరీషతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. మొదటి కాన్పులో కూతురు పుట్టింది. రెండో కాన్పుకు ఈ నెల రెండో తేదీన మ్యాదరిపేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆపరేషన్ చేయగా బాలుడు జన్మించాడు. దీంతో వైద్యుల సూచనల మేరకు బాలుడిని మంచిర్యాలలోని ఆస్పత్రిలో చేరిపించారు. అక్కడి వైద్యులు హార్ట్‌బీట్ తక్కువగా ఉందని చెప్పడంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి గుండె సంబంధిత వ్యాధి ఉందని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.3లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. ఆపరేషన్ ఆలస్యమైతే ప్రాణాపాయం ఉంటుందనే చెప్పడంతో ముందుగా రూ.30వేలు బంధువుల వద్ద అప్పుచేసి బుధవారం ఆపరేషన్ చేయించారు. డిశ్చార్జిలోగా మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉండడంతో దాతలు ఆదుకోవాలని ఆ నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. తాము ఫుట్‌పాత్‌పై చిన్న వ్యాపారం చేసుకుని జీవిస్తామని, తమవద్ద లక్షల్లో రూపాయలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడిని దయార్ధులు ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు.

ఫోన్‌పే, గుగూల్‌పే నం. 9010168238
గాయిత్రి కో-ఆపరేటివ్ నిర్మల్ బ్యాంక్
ఖాతా నంబర్ (101720021084038)
ఐఎఫ్‌సీఎస్ కోడ్ : (హెచ్‌డీఎఫ్‌సీవోసీటీజీసీయూబి)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

పసిడి ధర పైపైకి..!

- పది గ్రాములు రూ.56,350

తులం బంగారం ధరల్లో పెరుగుదల ఇలా...

తేదీ	ధర(రూ.ల్లో)
డిసెంబర్ 26	రూ.54,600
డిసెంబర్ 31	రూ.55,300
జనవరి 02	రూ.55,350
జనవరి 03	రూ.55,800
జనవరి 04	రూ.56,000
జనవరి 05	రూ.56,350



భైంసాటౌన్: రైతులు పండించే తెల్లబంగారం ధర నేలచూపులు చూస్తుంటే పసిడి ధర మాత్రం పైపైకి పోతోంది. పక్షం రోజుల్లోనే ఏకంగా రూ.2వేల వరకు పెరిగి, ప్రస్తుతం మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.56,350 పలుకుతోంది. దీంతో బంగారం కొనుగోలు చేద్దామనుకునేవారు కాస్త ఆలోచించాల్సి వస్తోంది. ఓవైపు మార్కెట్‌లో గిరాకీ లేక దుకాణాలు వెలవెలబోయి కనిపిస్తుండగా ధర మాత్రం రోజురోజుకూ పెరుగుతూపోతోందని వ్యాపారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుభకార్యాలు లేక గిరాకీలు లేవని, ఇప్పుడు పెరుగుతున్న ధరలతో బంగారం కొనుగోలుకు కొనుగోలుదారులు ఆసక్తిచూపడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు కొనుగోలు చేస్తే అమాంతం ధర తగ్గినప్పుడు నష్టపోతామని కొనుగోలుదారులు భావిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఉద్యోగాల పేరిట మోసగించిన వ్యక్తికి దేహశుద్ధి



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగం ఇప్పిస్తామని, క్లర్క్ పోస్టుకు ఎంపిక చేస్తామని లక్షల్లో వసూలు చేసిన సెక్యూరిటీ ఉద్యోగి మహేష్‌కు గురువారం బాధితులు దేహశుద్ధి చేశారు. సింగరేణి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న మహేష్ ఎనిమిది నెలల క్రితం ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నమ్మబలికి పలువురి వద్ద రూ.30 లక్షల వరకు వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించిన బాధితులు సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం బాధితులతో పాటు ఉద్యోగి కూడా ఎస్అండ్ పీసీ ఆఫీస్‌లో విచారణకు హాజరయ్యాడు. సదరు ఉద్యోగి బాధితులను గుర్తు పట్టనట్లు ప్రవర్తించాడు. అసలు వాళ్లెవరో తనకు తెలియదని చెప్పి కార్యాలయ ఆవరణ నుంచి బయటకు వెళ్లాడు. కోపోద్రిక్తులైన బాధితులు అతనికి దేహశుద్ధి చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా అనవసరంగా నలుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని ఉద్యోగి మహేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రెండో ఎస్సై మహేందర్ తెలిపారు. .

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో గతేడాది జరిగిన మూడు చోరీ కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ రెండో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుమన్ గ్రేవెల్ గురువారం తీర్పు ఇచ్చినట్లు సీఐ నారాయణ్‌నాయక్ తెలిపారు. 2022 మార్చి 3న పద్మశాలి కాలనీలో కమల్‌సింగ్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని, జూన్ 6న ఎడ్లవాడలోని సాయికృష్ణకు చెందిన బైక్‌ను పెద్దపల్లికి చెందిన నెడునూరి శ్రావణ్, ఆగస్టు 18న స్థానిక బీట్ మార్కెట్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచిన ట్రాక్టర్‌ను హుజూరాబాద్‌కు చెందిన గోసుకుల కనకయ్య దొంగిలించినట్లు ఆధారాలతో సహా అప్పటి ఎస్సై అంజన్న కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులకు 6నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ట్రస్మా ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చదువు, క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రోత్సహిస్తూ, అద్భుతమైన ప్రగతిని సాధించాలన్నారు. క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాగులో మునిగి... ఇసుక తీసి



చిట్యాల వాగులో ఇసుకను తోడుస్తున్న కూలీలు



వాగులోని తెప్పపైన ఇసుక..



తెప్పలపై ఇసుకను తీసుకొస్తున్న కూలీలు



నీటిలో నుంచి ఇసుక తీస్తున్న కూలీ

నిర్మల్‌రూరల్ మండలంలోనీ స్వర్ణ వాగు ప్రవహించే గ్రామాలైన చిట్యాల, సిద్దపూర్ కౌట్ల, సిద్ధిలకుంట, జఫ్రాపూర్ సమీపంలోని వాగులో ప్రమాదకరస్థితిలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. వాగులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ తెప్పలు తయారు చేసి ఇసుకను ఒడ్డుకు తీసుకొచ్చి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ప్రాణాలకు తెగించి నీటిలో మునిగి ఇసుకను తీస్తున్నారు. ఈ క్రమంలో ఏదైనా జరిగితే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యులంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దళారులు ఇసుకను దోచుకెళ్తున్న రెవెన్యూ సిబ్బంది, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి అక్రమంగా తరలిస్తున్న ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చోరీకి గురైన ఆటో అప్పగింత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో చోరీకి గురైన ఆటోని తిరిగి బాధితుడికి అప్పజెప్పినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 31న స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఒక ఆటో ఆపి విచారించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు రోజుల అనంతరం ఆటో యజమాని స్థానిక స్వర్ణ హాస్పిటల్ నుంచి నా ఆటో చోరీకి గురైందని పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఆటో ఓనర్ షేక్ మెహతాబ్ పోలీసులు పిలిపించి వాహన ధ్రువపత్రాలు పరిశీలించి ఆటోఅప్పగించారు. దీంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.



బాధితుడికి ఆటోను అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు